తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం - 6- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 63 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# యువత ఆవేదనను వినండి: సుప్రీం

## విద్యార్థి నిరసనలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు
## నిరసనకారుల పట్ల సంయమనంతో వ్యవహరించాలని సూచన
## హింసను అణచివేసే పేరుతో అతిగా స్పందించవద్దని హెచ్చరిక
## విద్యార్థుల ఆవేదనను వినడమే ఉత్తమ పరిష్కారమన్న ధర్మాసనం
## కేంద్రం నివేదిక తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడి



**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థి ఆందోళనలు, వాటి సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థుల పట్ల అధికారులు అత్యంత విచక్షణతో, సహనంతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. హింసను అరికట్టే క్రమంలో భద్రతా బలగాలు కూడా అదే స్థాయిలో ప్రతిస్పందిస్తే పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి ఆందోళనల సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనలపై దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. జూలై 20న జరిగిన నిరసనల్లో రాళ్లదాడులు, హింస కారణంగా ప్రభుత్వ, ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లిందని, అందుకు సంబంధిత సంస్థను బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఇప్పటికే పెండింగ్‌లో

మిగతా 7లో



# సాగునీటి ప్రాజెక్టులపై సీఎం విజ్ఞప్తి

- కేంద్ర పర్యావరణ మంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- పాలమూరు, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులపై విజ్ఞప్తి
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో త్వరితగతిన అనుమతులు కోరిన రాష్ట్రం
- జాప్యంతో ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని కేంద్రానికి వివరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):** పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి సాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను కోరారు.

మిగతా 7లో

## తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి

- జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ–మహారాష్ట్ర సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్రానికి వినతి
- చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి హామీ



2లో

# గుజరాత్‌లో చండీపుర వైరస్ కలకలం

- 22 మంది చిన్నారుల మృతి.. ఏడుగురికి చికిత్స
- 35 మందికి వైరస్ నిర్ధారణ.. పలు జిల్లాల్లో కేసులు
- అరుదైన వైరస్‌పై ఆరోగ్య శాఖ అప్రమత్తం
- పిల్లల్లో లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచన



**డెస్క్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):** గుజరాత్‌లో చండీపుర వైరస్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్ బారినపడి ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ప్రస్తుతం మరో ఏడుగురు చిన్నారులు రాష్ట్రంలోని

మిగతా 7లో



## హరీశ్‌రావుపై ఉత్తమ్ తీవ్ర విమర్శలు

- తెలంగాణ ప్రాజెక్టులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- సమ్మక్క సాగర్‌కు నెలాఖరులో నిరభ్యంతర పత్రం వస్తుందని వెల్లడి
- కాళేశ్వరం, నీటి హక్కులపై బీఆర్ఎస్‌ను నిలదీసిన మంత్రి
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ లేదని స్పష్టీకరణ

2లో

## సమ్మక్క సాగర్‌పై హరీశ్ రావు ప్రశ్నలు

- ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- కర్ణాటక సమావేశంపై సందేహాల వ్యక్తీకరణ
- 47 టీఎంసీల ప్రాజెక్టుపై ఆరోపణలు
- ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్

2లో






# ఏఐతో అత్యాధునిక డయల్–112 వ్యవస్థ ప్రారంభం

## తెలంగాణ పోలీసుల అత్యవసర సేవలకు సాంకేతిక నవీకరణ
## పోలీసు, అగ్నిమాపక, అంబులెన్స్ సేవలు ఒకే వేదికపై
## ఏఐ ఆధారిత కాల్ విశ్లేషణ, వేగవంతమైన స్పందన
## అత్యవసర సేవల్లో దేశానికి ఆదర్శంగా తెలంగాణ

**హైదరాబాద్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ పోలీసు శాఖ అత్యాధునిక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత నూతన తరం తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ (టీజీ-ఈఆర్ఎస్ఎస్) డయల్-112ను బుధవారం ప్రారంభించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీఐసీసీసీ) డీజీపీ సీవీ ఆనంద్ ఈ వ్యవస్థను ప్రారంభించారు. ఈ వేదిక ద్వారా పోలీసు, అగ్నిమాపక, అంబులెన్స్, మహిళల భద్రత, బాలల రక్షణ, విపత్తు నిర్వహణ తదితర అత్యవసర సేవలను ఒకే జాతీయ అత్యవసర నంబర్ 112 ద్వారా సమన్వయం చేయనున్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు డయల్-112 తొలి సంప్రదింపు కేంద్రంగా ఉంటుందని తెలిపారు. ప్రతి కాల్‌ను వేగంగా, సమర్థంగా పరిష్కరించడం ద్వారా ప్రజల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ వేదిక ద్వారా అత్యవసర సేవలను మరింత వేగంగా, సమర్థవంతంగా అందించగలమని వెల్లడించారు. నూతన వ్యవస్థలో డూప్లికేట్, అవసరం లేని కాల్‌లను ఏఐ సాయంతో గుర్తించి వడపోత చేయడం,

మిగతా 2లో

# 22ఏ భూములపై అర్హులకు అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమినీ నిషేధిత జాబితాలో చేర్చలేదన్న మంత్రి
- 22ఏ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు
- ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు అర్హుల హక్కులకూ రక్షణ
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులకు మంత్రి పొంగులేటి స్పష్టమైన దిశానిర్దేశం



**హైదరాబాద్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఒక్క అర్హుడికీ అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన భూహక్కుదారుల హక్కులను పరిరక్షిస్తూనే ప్రభుత్వ భూములను కాపాడటం అనే ద్వంద్వ లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులకు ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సాగునీటి ప్రాజెక్టులపై సీఎం విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ పర్యటనలో భాగంగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన సానుకూల తీర్పు నేపథ్యంలో పర్యావరణ అనుమతుల జారీకి ఎలాంటి అడ్డంకులు లేవని ముఖ్యమంత్రి వివరించారు. రైతుల ప్రయోజనాలు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న అనుమతులను వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై ఇప్పటికే రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతల పథకంపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్ ప్రాజెక్టుపై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అనుమతుల జాప్యం కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయి ప్రాజెక్టుల వ్యయం గణనీయంగా పెరుగుతోందని వివరించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరుతాయని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగానికి ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టులను ఆలస్యం చేయకుండా పర్యావరణ అనుమతులు జారీ చేసి పనులు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఏర్పడిన అనుకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. రాష్ట్రాభివృద్ధి, వ్యవసాయ రంగ ప్రగతికి ఈ ప్రాజెక్టులు అత్యంత కీలకమని సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేమ్ నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హరీశ్‌రావుపై ఉత్తమ్ తీవ్ర విమర్శలు

హైదరాబాద్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కట్టుకథలు అల్లుతూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడే విషయంలో ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా ప్రతి జలమండలి సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇది కొత్త విషయం కాదని, అలాంటి అభ్యంతరాలను సమర్థవంతంగా తిప్పికొడుతూ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతున్నామని చెప్పారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి టెక్నికల్



అడ్వైజరీ కమిటీ అనుమతులు సాధించడం ద్వారా తమ ప్రభుత్వ నిబద్ధతను నిరూపించామని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం, పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయని మంత్రి గుర్తు చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం కూడా అప్పుడే పూర్తయిందని పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తెలంగాణ నీటి హక్కులను కాపాడడంలో బీఆర్ఎస్ విఫలమైందని ఆరోపించారు. ఇప్పుడు అధికారాన్ని కోల్పోయాక మొసలి కన్నీరు కారుస్తూ విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపినట్లు ఉత్తమ్ వెల్లడించారు. ఇప్పటికే మూడు సార్లు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేశామని, ఈ నెలాఖరులో ఎన్ఓసీ ఇస్తామని అక్కడి ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో ఇలాంటి ప్రయత్నం చేశారా అని ప్రశ్నించారు.

పోలవరం-బనకచర్ల ప్రతిపాదన వెలుగులోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్రం, జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం, జలమండళ్లతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి తెలంగాణ అభ్యంతరాలను బలంగా వినిపించిందని మంత్రి తెలిపారు. ఈ అంశంపై సుప్రీంకోర్టులో అసలు వ్యాజ్యం, మధ్యంతర దరఖాస్తులు కూడా దాఖలు చేశామని, ఇప్పటికే ప్రతివాదులకు సమాధానాలు ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించిందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి ఆరోపణలపై ముందుగా సమాధానం చెప్పాలని హరీశ్‌రావును ఉత్తమ్ కుమార్ రెడ్డి నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల నీటి హక్కుల పరిరక్షణ, సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధన, రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రస్తుత ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.

# సమ్మక్క సాగర్‌పై హరీశ్ రావు ప్రశ్నలు

హైదరాబాద్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):

సమ్మక్క-సారక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశంపై తెలంగాణ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని మాజీ మంత్రి, అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రశ్నలు సంధించారు. ప్రాజెక్టుకు సంబంధించి వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సమావేశంలో గోదావరి జలాల అంశంపై ఎలాంటి చర్చ జరిగిందని హరీశ్ రావు ప్రశ్నించారు. ఆ సమావేశంలో తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో వెల్లడించాలని కోరారు. 47 టీఎంసీల సామర్థ్యంతో ప్రతిపాదించిన సమ్మక్క-సారక్క సాగర్ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం వదులుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించిందంటూ వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వార్తల్లో వాస్తవం ఉందా లేదా అన్న విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, నీటి హక్కుల విషయంలో ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని హరీశ్ రావు అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలు తీసుకుంటే ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని పేర్కొన్నారు. నీటి హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతి నిర్ణయం ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. అయితే హరీశ్ రావు చేసిన ఈ ఆరోపణలు, ప్రశ్నలపై తెలంగాణ ప్రభుత్వం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది. ప్రస్తుతం ఇవి రాజకీయ ఆరోపణలుగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ వివరణ కోసం రాజకీయ వర్గాలు ఎదురుచూస్తున్నాయి.



# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రాణహిత నదిపై ప్రతిపాదిత తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఇప్పించడంతో పాటు బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్రను ఒప్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. బుధవారం ఢిల్లీలో జల్ శక్తి మంత్రి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి పాల్గొన్న సీఎం ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానిపై ప్రధాన మంత్రి కార్యాలయం స్పందించి జల్ శక్తి శాఖకు పంపిన లేఖను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ సాగునీటి అవసరాలను తీర్చడంలో ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గతంలో తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాల మధ్య 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి ఒప్పందం కుదిరిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. అనంతరం పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిర్వహించిన అధ్యయనంలో 148 మీటర్లు, 152 మీటర్ల ఎత్తుల్లో బ్యారేజీ నిర్మించినా ముంపు ప్రభావంలో పెద్దగా తేడా ఉండదని తేలిందని వివరించారు. ముంపులో సగం వరకు నదీగర్భంలోనే ఉంటుందని కూడా కేంద్ర మంత్రికి వివరించారు. 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే అవసరమైన స్థాయిలో గురుత్వాకర్షణ పద్ధతిలో నీటి సరఫరా సాధ్యం కాదని, 150 నుంచి 152 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే విద్యుత్ వినియోగం లేకుండానే గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేసే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. దీంతో సాగునీటి పంపిణీ మరింత సమర్థవంతంగా జరిగి విద్యుత్ వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని, వీలైనంత త్వరగా తెలంగాణ-మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలకు సాగునీటి వసతి కల్పించడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని వివరించారు. ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఈ అంశంపై లేఖ అందినట్లు కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. తొలుత కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. అనంతరం రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, వేమ్ నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, శాఖ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐతో అత్యాధునిక డయల్–112 వ్యవస్థ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

అత్యవసరత ఆధారంగా ఘటనలకు ప్రాధాన్య క్రమం నిర్ణయించడం, సంబంధిత శాఖలకు కాల్‌లను స్వయంచాలకంగా మళ్లించడం, ఫీల్డ్ సిబ్బందిని ఏఐ ఆధారంగా పంపించడం, వాయిస్‌ను పాఠ్య రూపంలోకి మార్చడం, కాలర్ ఉన్న ప్రదేశాన్ని లొకేషన్ ఆధారిత సేవలు, అడ్వాన్స్‌డ్ లొకేషన్ సర్వీసెస్, గూగుల్ మ్యాప్స్ ద్వారా గుర్తించడం వంటి అనేక ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ నవీకరణతో కాల్ స్వీకరణ సమయం 100 సెకన్ల నుంచి 69 సెకన్లకు, డిస్పాచ్ సమయం 90 సెకన్ల నుంచి 64 సెకన్లకు తగ్గిందని అధికారులు తెలిపారు. మొత్తం కాల్ ప్రాసెసింగ్ సమయం 190 సెకన్ల నుంచి 133 సెకన్లకు తగ్గి దాదాపు 30 శాతం మెరుగుదల నమోదైందని వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణలో పట్టణ ప్రాంతాల్లో సగటు అత్యవసర స్పందన సమయం 6 నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో 15 నిమిషాలు, రాష్ట్ర సగటు 10 నిమిషాల 30 సెకన్లుగా ఉందని, ఇది దేశ సగటు 18 నిమిషాల కంటే మెరుగైనదని పేర్కొన్నారు.

ప్రస్తుతం టీజీ-ఈఆర్ఎస్ఎస్ కేంద్రం 24 గంటలూ 164 మంది శిక్షణ పొందిన సిబ్బందితో పనిచేస్తోంది. రోజుకు సుమారు 14 లక్షల కాల్స్ ఐవీఆర్ వ్యవస్థకు చేరుతుండగా, వాటిలో సుమారు 18 వేల అత్యవసర కాల్స్‌ను స్వీకరించి 7,500 ఘటనలను ఫీల్డ్ బృందాలకు పంపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా




31 పోలీసు యూనిట్లలోని 1,860 పెట్రోలింగ్ వాహనాలను ఈ వేదికతో అనుసంధానం చేయడంతో సమీపంలో ఉన్న వాహనాన్ని స్వయంచాలకంగా గుర్తించి వేగంగా సంఘటన స్థలానికి పంపే అవకాశం కలిగింది. డయల్-100, డయల్-112తో పాటు ఇతర అత్యవసర హెల్ప్‌లైన్లను ప్రభుత్వ ఆధీనంలోని టీజీ ఐసీసీసీ మౌలిక సదుపాయాలకు విజయవంతంగా మార్చినట్లు డీజీపీ తెలిపారు. తదుపరి దశలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లలో ఏఐ ఆధారిత డ్రోన్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెడతామని వెల్లడించారు. అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, విపత్తులు, శాంతిభద్రతల సమస్యలు, గుంపుల నియంత్రణ, గాలింపు-రక్షణ చర్యల్లో ఈ డ్రోన్లు తొలి స్పందన దళాలుగా పనిచేస్తాయని తెలిపారు. భవిష్యత్తులో ఏఐ, అంచనా విశ్లేషణ, స్మార్ట్ సిటీ సమన్వయం, బహుభాషా వర్చువల్ అసిస్టెంట్లు, డ్రోన్ ఆధారిత సేవలు, తదుపరి తరం నిర్ణయ సహాయక వ్యవస్థలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసు, అగ్నిమాపక, అంబులెన్స్ తదితర సేవల కోసం ఒకే నంబర్ 112ను గుర్తుంచుకోవాలని డీజీపీ పిలుపునిచ్చారు.

# 22ఏ భూములపై అర్హులకు అన్యాయం జరగదు

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవహరించడం లేదని, వివాదాలు లేని ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో చేర్చారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు.

క్యూర్ పరిధిలోని 22ఏ భూములకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి ఆలోచనలను అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను చట్టబద్ధంగా పరిశీలించి, అర్హత ఉన్న భూములను గుర్తించి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేసును భూ రికార్డులు, చట్టపరమైన అంశాలు, వాస్తవాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులను తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోనే వివాదాలకు సంబంధించిన అన్ని ప్రక్రియలు పూర్తి చేసి తుది



నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ రిజిస్ట్రేషన్లు, అక్రమ లావాదేవీలు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజల హక్కులు, ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ గేమ్స్ పేరుతో సైబర్ మోసాలు..
## అప్రమత్తంగా ఉండాలి: ముల్కనూర్ ఎస్ఐ రాజు

**భీమదేవరపల్లి, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):**



మండలంలో ఇటీవల ఆన్‌లైన్ గేమ్స్ పేరుతో సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో యువత, విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముల్కనూర్ ఎస్ఐ రాజు సూచించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు వస్తుందనే ఆశను ఆసరాగా చేసుకుని గేమింగ్ యాప్‌లు, టెలిగ్రామ్ లింకులు, సోషల్ మీడియా ప్రకటనల ద్వారా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, గుర్తు తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయకుండా ఉండాలని సూచించారు. ఏదైనా పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ లేదా యాప్ విశ్వసనీయతను పూర్తిగా ధృవీకరించుకోవాలని చెప్పారు. అలాగే బ్యాంకు ఖాతా వివరాలు, OTP, UPI PIN వంటి గోప్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు.

సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే cybercrime.gov.inలో ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని ఎస్ఐ రాజు తెలిపారు. ప్రజల అప్రమత్తతే సైబర్ నేరాలను అరికట్టేందుకు అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని ఆయన పేర్కొన్నారు.



## ముల్కనూరు రైతులకు ఉద్యాన పంటల సాగుపై అవగాహన

**భీమదేవరపల్లి, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):**



ముల్కనూరు కోఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కూరగాయలు సాగు చేస్తున్న 50 మంది రైతులకు వాతావరణ అనుకూల సాగు సాంకేతికతలపై ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ సైన్స్, ముల్కనూరు కోఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్ర ఆధ్వర్యంలో జరిగింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించి, వాతావరణ మార్పుల నేపథ్యంలో కూరగాయల సాగులో అనుసరించాల్సిన ఆధునిక సాంకేతికతలు, నాణ్యమైన నారుమడి తయారీ, కోత అనంతర నిర్వహణ, తెగుళ్లు-పురుగుల గుర్తింపు, నివారణ చర్యలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు.

వెజిటేబుల్ రీసెర్చ్ స్టేషన్, రాజేంద్రనగర్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ అనుకూల కూరగాయల సాగు పద్ధతులను వివరించారు. పీహెచ్‌డీ పరిశోధకులు నిరోషా, లావణ్య నాణ్యమైన నారుమడి తయారీ, కోత అనంతర నిర్వహణపై శిక్షణ అందించగా, డాక్టర్ సురేష్ కూరగాయల పంటల్లో వచ్చే పురుగులు, వ్యాధుల గుర్తింపు మరియు సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం దత్తత గ్రామమైన క్షీరసాగర్‌లో సర్పంచ్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్షేత్ర ప్రదర్శనను రైతులు సందర్శించి, వాతావరణ అనుకూల కూరగాయల సాగు పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో తమ సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

ఈ శిక్షణ ద్వారా తమకు ఎంతో ఉపయోగకరమైన సమాచారం అందిందని రైతులు పేర్కొంటూ, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అధికారులు, శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవసాయ అధికారి సంగ శ్రీనివాస్, సహాయ వ్యవసాయ అధికారులు అర్జున్, ప్రశాంత్, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## 14 గుంటల భూమి ఆక్రమణ.. న్యాయం చేయాలని యాదగిరి ఆవేదన

**వేలేరు ఆగస్టు 5(తెలంగాణ ముచ్చట్లు ):**

వేలేరు మండలం గుండ్లసాగర్ గ్రామానికి చెందిన పోలేపెల్లి రేణుక,యాదగిరి తనకు చెందిన 14 గుంటల వ్యవసాయ భూమిని కున్నే స్వామి ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ విషయంలో తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తెలిపారు.తమ భూమిని తిరిగి ఇవ్వాలని అడిగితే అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ, చంపుతానని బెదిరిస్తున్నాడని యాదగిరి వాపోయారు. ఈ విషయమై గతంలోనే వేలేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తమకు చెందిన 14 గుంటల వ్యవసాయ భూమిని తిరిగి ఇప్పించాలని బాధితుడు కోరారు.

## ఆర్భాటాలకు దూరంగా... సేవా కార్యక్రమాలతో రాజేష్ ఠాకూర్ జన్మదినం

- **జమ్మికుంట టౌన్, ఆగస్టు 05 (తెలంగాణ ముచ్చట్లు):**






పుట్టినరోజు వేడుకలను ఆర్భాటాలకు దూరంగా ఉంచి సమాజ సేవతో నిర్వహిస్తేనే వాటికి నిజమైన సార్థకత చేకూరుతుందనే సందేశాన్ని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు రాజేష్ ఠాకూర్ జన్మదిన వేడుకలు చాటిచెప్పాయి. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణంలో బీజేపీ నాయకులు అన్నదానం, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ వంటి పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

జమ్మికుంటలోని బొమ్మల గుడిలో అన్నదాన సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కంటే గొప్ప దానం లేదని, ప్రతి ఒక్కరూ తమ జీవితంలో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

అనంతరం ఆబాది ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజేష్ ఠాకూర్ సమాజ సేవను తన బాధ్యతగా భావిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, పార్టీ బలోపేతంతో పాటు పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం కలగాలని ఆకాంక్షించారు.




## గోరింటాకు పండుగతో విద్యార్థుల్లో సంస్కృతి చైతన్యం

- **కోరపెల్లి జడ్‌పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు సంప్రదాయాలపై అవగాహన**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 05 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆషాఢ మాసం సందర్భంగా కోరపెల్లి జడ్‌పీహెచ్‌ఎస్‌లో బుధవారం గోరింటాకు పండుగను వైభవంగా నిర్వహించారు. సంప్రదాయాలు, సంస్కృతిని విద్యార్థులకు చేరువ చేసే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేతిరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పూర్వకాలంలో తాజా గోరింటాకు ఆకులను రోలు-రోకలితో నూరి మహిళలు ఒకరికొకరు చేతులకు, కాళ్లకు అలంకరించుకునేవారని వివరించారు. గోరింటాకు పండుగను లక్ష్మీదేవి, గౌరీదేవి ఆరాధనతో ముడిపెట్టి జరుపుకుంటారని తెలిపారు.

గోరింటాకు ఆకుపచ్చ రంగు సస్యశ్యామలత్వానికి, జీవనశక్తికి ప్రతీకగా నిలుస్తుందని, గోరింటాకు ఎంత గాఢమైన ఎరుపు రంగులో పండితే అంత సౌభాగ్యానికి సూచికగా భావిస్తారని పేర్కొన్నారు. శాస్త్రీయంగా కూడా ఆషాఢ మాసంలో శరీరంలోని వేడి తగ్గించడంలో గోరింటాకు ఉపయోగపడుతుందని ఆయుర్వేద గ్రంథాలు లఆషాఢ మాసంలో కొత్త కోడళ్లు పుట్టింటికి వెళ్లే ఆనవాయితీ, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలను బలోపేతం చేసే సంప్రదాయాలకు గోరింటాకు పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఈ పండుగ కుటుంబ ఐక్యత, సౌభాగ్యం, ప్రకృతి పరిరక్షణకు ప్రతీకగా భావిస్తారని చెప్పారు.

కార్యక్రమంలో విద్యార్థులు జానపద పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేసి గోరింటాకు అలంకరణలో పాల్గొని ఆనందంగా గడిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. రాజయ్య, పి. శ్రీనివాస్, ఏ. నరహరి, సి. రవికాంత్ రాజ్, పి. రాజు, కె. పద్మ, జి. శ్రీను, పి. కుమారస్వామి, పి. విజేందర్ రెడ్డి, కార్యాలయ సబార్డినేట్ స్వరూపారాణితో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కౌశిక్ రెడ్డివి శిఖండి రాజకీయాలు: ఎర్రబెల్లి సంపత్ రావు

- **ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరిక**

**హుజూరాబాద్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):**



హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నియోజకవర్గంలో శిఖండి రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ఎమ్మెల్యేగా ఎన్నికై రెండున్నర సంవత్సరాలు గడిచినా నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదని ఆరోపించారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా కేవలం వార్తల్లో నిలిచేందుకే కౌశిక్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ముఖ్యంగా హుజూరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోయినా వాటి కోసం పోరాడడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని అన్నారు.

2021 హుజూరాబాద్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కోట్ల రూపాయలు ఖర్చు చేసి నాయకులను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిందని, అదే తరహా రాజకీయాలను ఇప్పుడు కౌశిక్ రెడ్డి కొనసాగిస్తున్నారని సంపత్ రావు ఆరోపించారు. అయితే ఆనాడు ప్రజలు టీఆర్ఎస్‌కు ఇచ్చిన తీర్పును ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలని సూచించారు.

ఇటీవల కొన్ని సంస్థలు నిర్వహించిన సర్వేల్లో కౌశిక్ రెడ్డి మూడో స్థానానికి పడిపోయారని, ఆ విషయం బీఆర్ఎస్ అధిష్ఠానానికి కూడా తెలిసిందని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కౌశిక్ రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ దక్కడం కూడా కష్టమేనన్న భయంతో ప్రత్యామ్నాయ రాజకీయ మార్గాలను అన్వేషిస్తున్నారని ఆరోపించారు.

నియోజకవర్గ ప్రజలను మర్చిపోయిన కౌశిక్ రెడ్డిని ప్రజలు కూడా మర్చిపోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, రాజకీయాలు పక్కనబెట్టి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని ఎర్రబెల్లి సంపత్ రావు హితవు పలికారు. లేదంటే రాబోయే ఎన్నికల్లో హుజూరాబాద్ ప్రజలు తగిన రాజకీయ తీర్పు ఇస్తారని హెచ్చరించారు.

## మృత కార్యకర్త కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ సాయం


- **బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్**

**హుజూరాబాద్,ఆగష్టు 5(తెలంగాణ ముచ్చట్లు ):**

కష్టాల్లో ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి అండగా నిలవడం తన బాధ్యత అని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మరోసారి చాటిచెప్పారు. హుజూరాబాద్ పట్టణంలోని 23వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు గంధం శివరాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం ఆయన నివాసానికి వెళ్లిన వొడితల ప్రణవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ సందర్భంగా రూ.మూడు లక్షల యాభైవేలు విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనవగా, వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎలాంటి ఆపద వచ్చినా పార్టీ అండగా ఉంటుందని ప్రణవ్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, వార్డు అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# చేనేత చైతన్య మహాసభకు విశేష స్పందన

- **హుజురాబాద్ నుంచి భారీగా హాజరైన పద్మశాలి సంఘం నాయకులు, నేత కార్మికులు**

**హుజురాబాద్,ఆగస్టు 5(తెలంగాణ ముచ్చట్లు ):**



జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలో నిర్వహించిన తెలంగాణ చేనేత చైతన్య మహాసభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర చేనేత అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీ దూడం వెంకట్ రమణ ముఖ్య అతిథిగా హాజరై చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, ఆహ్వాన కమిటీ చైర్మన్ ఎలిగేటి శ్రీనివాస్ ఆహ్వానం మేరకు హుజురాబాద్ మండలం నుంచి పద్మశాలి సంఘం నాయకులు, చేనేత ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు బండారి సదానందం, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రామచంద్రము, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు ఎలిగేటి ఉపేందర్, ముశం వెంకట్ నారాయణ, రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు జడల అశోక్, బింగి రాణి, సంగెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా పద్మశాలి సంఘం సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, నేత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై చేనేత రంగ పరిరక్షణ, అభివృద్ధికి ఐక్యంగా ముందుకు సాగాలని సంకల్పం వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల సమర్థ అమలు, సంప్రదాయ చేనేతకు మరింత ప్రోత్సాహం కల్పించాల్సిన అవసరాన్ని పలువురు వక్తలు ఈ సందర్భంగా ప్రస్తావించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను పాల్గొన్న ప్రతినిధులు అభినందించారు.

# కరీంనగర్‌లో ఘనంగా కళాకారుల బోనాల జాతర

- **కళాకారుల వినూత్న వేషధారణలు..**
- **పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక మొక్కులు**

**కరీంనగర్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):**



కరీంనగర్ పట్టణంలో కళాకారుల ఆధ్వర్యంలో బోనాల జాతర భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా తెలంగాణ చౌరస్తాలోని జ్యోతిబాపూలే మైదానం నుంచి కోతి రాంపూర్‌లోని పోచమ్మ ఆలయం వరకు కళాకారులు డప్పు చప్పుళ్లు, భక్తి గీతాల నడుమ భారీ ఊరేగింపుగా తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

ఈ జాతరలో సుమారు నూటయాభై మంది కళాకారులు పోతురాజు, శివుడు, హనుమంతుడు, వివిధ జానపద పాత్రలతో పాటు పలు వినూత్న వేషధారణల్లో పాల్గొని ఆకట్టుకున్నారు. వారి కళా ప్రదర్శనలు భక్తులను, ప్రజలను విశేషంగా అలరించాయి.

ఈ సందర్భంగా కళాకారులు కరీంనగర్ పట్టణ ప్రజలందరికీ పోచమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. అమ్మవారి కటాక్షంతో ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం నెలకొంటాయని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, కళాకారులు, స్థానిక ప్రజలు పాల్గొని బోనాల జాతరను విజయవంతం చేశారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సాయి గణేష్ ఎంపిక

**వనపర్తి,ఆగస్టు05(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లాలో నేషనల్ జావెలిన్ డే సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మోజర్ల ఉద్యాన కళాశాల విద్యార్థి సాయి గణేష్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.డాక్టర్ బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో అండర్-20 జావెలిన్ విభాగంలో పాల్గొన్న సాయి గణేష్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ విజయంతో తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనే అర్హత సాధించాడు.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సాయి గణేష్‌ను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీణా జోషి ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.రాష్ట్రస్థాయి పోటీలలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.హనుమకొండ జిల్లా జేఎన్ గ్రౌండ్స్‌లో ఈనెల 7, 8 తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో సాయి గణేష్ పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా తమ దినచర్యలో కొంత సమయం కేటాయించాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల వంటి లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు.కార్యక్రమంలో ఓఎస్‌ఏ రాజశేఖర్, డాక్టర్ షహనాజ్, ఫిజికల్ డైరెక్టర్ మహేష్, అధ్యాపక బృందం పాల్గొని సాయి గణేష్‌ను అభినందించారు.



# వేలేరులో ప్రజాప్రతినిధులు–అధికారుల సమన్వయ, సమీక్ష సమావేశం




**వేలేరు ఆగస్టు 5(తెలంగాణ ముచ్చట్లు ):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేలేరు మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయ మరియు సమీక్ష సమావేశం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, వేలేరు మండల ప్రత్యేక అధికారి విజయ్ చందు అధ్యక్షతన నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో వేలేరు మండల తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ కిషన్ నాయక్, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి విజయ్ చందు, తహసీల్దార్, ఎంపీడీఓ, సర్పంచ్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు మండలంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అవుతున్నాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా అధికారులు, సర్పంచులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో సర్పంచులు అశోక్, అనిత, కిరణ్, శ్రీనివాస్, రమాదేవి, మానస, సాంబయ్యతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సంప్రదాయాల పరిరక్షణకు గోరింటాకు పండుగ వేదిక

**ఇల్లందకుంట, ఆగస్టు 05 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కేతిరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, గోరింటాకు తయారీ విధానాన్ని విద్యార్థులకు వివరించడంతో పాటు దాని సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ఆయుర్వేద ప్రాధాన్యాన్ని వివరించారు. గోరింటాకు పండుగ కుటుంబ బంధాలను, సౌభాగ్యాన్ని, ప్రకృతితో మమేకాన్ని చాటిచెప్పే సంప్రదాయమని తెలిపారు.

విద్యార్థులు జానపద పాటలు పాడుతూ, ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది విద్యార్థులకు తెలుగు సంప్రదాయాల విశిష్టతను వివరించి, వాటిని పరిరక్షించాల్సిన అవసరాన్ని తెలియజేశారు.





## అన్ని రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు చేయాలి: తెలంగాణ రక్షణ సేన

- **సీఎంఆర్ బియ్యం అక్రమాలపై పీడీ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్**

**కరీంనగర్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రవ్యాప్తంగా సీఎంఆర్ బియ్యం అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, అన్ని రైస్ మిల్లులలో విజిలెన్స్ దాడులు నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. సీఎంఆర్ బియ్యాన్ని అక్రమంగా విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పౌరసరఫరాల శాఖ అధికారులు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టి, చిన్న రైస్ మిల్లులపై మాత్రమే దాడులు నిర్వహించడం వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. ప్రభుత్వ సమీక్ష సమావేశాల్లో సివిల్ సప్లయ్ వ్యవస్థకు తూట్లు పొడిచిన వారినే భాగస్వాములుగా చేసుకోవడం విచారకరమని అన్నారు.

కరీంనగర్ జిల్లాలో కొందరు సివిల్ సప్లయ్ అధికారులు, బడా రైస్ మిల్లర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించిన ఆయన, జిల్లాలో పెద్దఎత్తున సీఎంఆర్ బియ్యం గల్లంతు కావడానికి సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని అక్రమార్కులకు కట్టబెడుతున్న అధికారులపై ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి, జిల్లా నాయకులు రంగరవేణి లక్ష్మణ్, శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్, గర్షకుర్తి విద్యాసాగర్, నూతి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీవో స్థాయిలో ప్రజావాణి అవసరం లేదు

- **మండలం, జిల్లా, రాష్ట్రస్థాయి కార్యక్రమాలే చాలు**
- **డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**వనపర్తి,ఆగస్టు05(తెలంగాణ ముచ్చట్లు):**

ఆర్డీవో స్థాయిలో ప్రజావాణి నిర్వహణ అవసరం లేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ చిన్నారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. మండలం, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. అయితే, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని స్పష్టం చేశారు.ఆర్డీవో కార్యాలయాలు దాదాపుగా కలెక్టరేట్ ప్రాంగణంలోనే లేదా సమీపంలోనే ఉంటాయని తెలిపారు. మండల, జిల్లాస్థాయి ప్రజావాణిల మధ్య మరో స్థాయిగా ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేకంగా ప్రజావాణి నిర్వహించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పునరాలోచన చేసి తగిన దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డాక్టర్ చిన్నారెడ్డి సూచించారు.





# చిలుకటోనిపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా తల్లి పాల వారోత్సవాలు

- **wwగర్భిణీలకు శ్రీమంతాలు.. చిన్నారులకు అన్నప్రాసన**

**పెద్దమందడి,ఆగస్టు05(తెలంగాణ ముచ్చట్లు):**

తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చిలుకటోనిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించి, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ అమృత, సూపర్వైజర్ సుధ మాట్లాడుతూ.. శిశువుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని అన్నారు. పుట్టిన వెంటనే శిశువులకు తల్లిపాలు అందించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలలో శిశువులకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలని తెలిపారు. తల్లి, శిశు సంరక్షణపై కుటుంబ సభ్యులు కూడా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.తల్లి పాల వారోత్సవాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా తల్లి, శిశు ఆరోగ్యంపై సమాజంలో మరింత చైతన్యం తీసుకురావడమే లక్ష్యమన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశ్విత, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీరాములు, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణయ్య, భారతి, అంగన్వాడీ టీచర్ మంజుల, అంగన్వాడీ హెల్పర్ అంజమ్మ, ఆరోగ్య కార్యకర్త తారాదేవి, ఆశా కార్యకర్త వసంత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


TELANGANA MUCHATLU
తెలంగాణ ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ప్రకృతిని ప్రేమించడం ఒక కళ

- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**

**వనపర్తి,ఆగస్టు05( తెలంగాణ ముచ్చట్లు):**



కొంచెం అభిరుచి, ఇంకొంచెం ఆలోచన, మరికొంత ఓపిక ఉంటే ఇంటిని నందన వనంలా తీర్చిదిద్దుకోవచ్చని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.బుధవారం పట్టణంలోని మరికుంటలో తమ ఇంటిపై మిద్దె తోటను పెంచుతున్న జైని శ్రీనివాసులు, జయలక్ష్మి దంపతులను సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రకృతి ప్రతి జీవరాశి మనుగడకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రకృతిని ప్రేమించడం, కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కోరారు.కరోనా మహమ్మారి మానవ జీవితంలో అనేక మార్పులకు కారణమైందని, ప్రజల్లో ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగిందని తెలిపారు. తమకు అందుబాటులో ఉన్న స్థలంలోనే ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవడంతో పాటు వివిధ రకాల ఔషధ మొక్కలు, పండ్ల చెట్లను పెంచుకోవడం మంచి అలవాటుగా మారిందన్నారు.ఈ క్రమంలో శ్రీనివాసులు ,జయలక్ష్మి దంపతులు తమ మిద్దె తోటలో దాదాపు 200 రకాల మొక్కలను పెంచుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడమే కాకుండా, ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని శంకర్ గౌడ్ ప్రశంసించారు.పర్యావరణ ప్రేమికులైన ఈ దంపతులను సాహితీ కళా వేదిక సభ్యులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డీఎస్ సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మ థామస్, బైరోజు చంద్రశేఖర్, దేశి రాములు యాదవ్, బండారు శ్రీనివాస్, రాంరెడ్డి, జయంత్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, ఎడ్విన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెరుల ఆత్మగౌరవ పోరాటం మరింత ఉధృతం

**ఎల్కతుర్తి, ఆగస్టు 5 ( తెలంగాణ ముచ్చట్లు):**



వడ్డెరుల హక్కుల సాధన, ఎస్టీ హోదా కల్పన, మైనింగ్ రంగంలో 33 శాతం వాటా సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని ఎల్కతుర్తి మండల వడ్డెర సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన వడ్డెర సంఘం హక్కుల సాధన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, వడ్డెర సమాజం సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో న్యాయమైన హక్కులు పొందే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. మండల అధ్యక్షులు గొల్లెన ఎల్లయ్య మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో సంఘాన్ని మరింత బలోపేతం చేసి వడ్డెరులందరినీ ఒకే వేదిక పైకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్టీ హోదా సాధనతో పాటు మైనింగ్ రంగంలో 33 శాతం వాటా కోసం సమన్వయంతో, ఐక్యంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధి కోసం యువత, మహిళలు ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు వల్లెపు సుధాకర్, హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు బొంత రమేష్, పట్టణ అధ్యక్షులు ఓర్సు కుమారస్వామి, ఉపాధ్యక్షులు ఆలకుంట సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి అల్లెపు ప్రశాంత్, కోశాధికారి అల్లెపు రాజు, కార్యదర్శి శివరాత్రి భిక్షపతి, యూత్ ఇన్‌చార్జ్ బొంత అర్జున్‌తో పాటు రామకృష్ణపూర్, దండెపల్లి, జగన్నాథ్‌పూర్, దామెర, బావుపేట, ఇంద్రానగర్ శాఖల అధ్యక్షులు, గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు..

- **మడిపల్లి, సైదాబాద్‌లో ఉచిత వైద్య శిబిరాలు.. 220 మందికి పరీక్షలు, మందుల పంపిణీ**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 05 (తెలంగాణ ముచ్చట్లు):**

వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని వైద్య నిపుణులు సూచించారు. జమ్మికుంట మండలంలోని మడిపల్లి, సైదాబాద్ గ్రామాల్లో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. జమ్మికుంట ఆదిత్య-అమృత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, హనుమకొండ శ్రీ లక్ష్మీనరసింహ లూమినస్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో శిబిరాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు తిరుమల-వెంకటేష్, పుప్పాల రాజారం మాట్లాడుతూ, ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యమనే భావనతో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, గైనకాలజిస్టులు డాక్టర్ గ్రీష్మ, డాక్టర్ తేజస్విని, డాక్టర్ సంకీర్తన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి, మానసిక ఒత్తిడి కారణంగా గుండెపోటు, మెదడు పక్షవాతం వంటి వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. సమతుల్య ఆహారం, నిత్య వ్యాయామం, తగినంత నీరు సేవించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ముఖ్యంగా మహిళలు ఆరోగ్యంపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. శిబిరాల్లో మొత్తం 220 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ, పోషకాహారాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14 కేంద్రాల పరిధిలోని 180 గ్రామాల్లో నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, ఇప్పటివరకు దాదాపు రూ.2 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు.



ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు కె. సుమలత, ఏ. స్వాతి, ఆసియా, ఉపసర్పంచులు కస్తూరి శ్రీనాథ్, ఉప్మేమల్ల తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు అంజిరెడ్డి, అంకుస్, మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, పీఆర్‌వోలు రఫిక్, దుర్గాప్రసాద్, సంపత్ రెడ్డి, రమేష్, భిక్షపతి, రాజేష్, ఆస్పత్రి సిబ్బంది అనిల్ రావు, శ్రావణ్, రంజిత్, పూజ, సంతోషిని, అనూష, శృతి, భారతి, కృష్ణవేణి, ప్రసన్నతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వనపర్తి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి రూ.20 లక్షలు

- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో ఎస్‌డీఎఫ్ నిధుల మంజూరు**

**వనపర్తి,ఆగస్టు05(తెలంగాణ ముచ్చట్లు):**




వనపర్తి జిల్లా కేంద్రంలో సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి రూ.20 లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్) మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) ద్వారా పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వనపర్తి పర్యటనకు వచ్చిన సందర్భంగా స్థానిక జర్నలిస్టులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమక్షంలో మంత్రికి వినతి పత్రం అందజేశారు.జర్నలిస్టులకు శాశ్వత వేదికగా నిలిచేలా సురవరం ప్రతాపరెడ్డి పేరుతో ప్రెస్‌క్లబ్ భవనాన్ని నిర్మించాలని వారు కోరారు. జర్నలిస్టుల విజ్ఞప్తిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించగా, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీంతో ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. ప్రెస్‌క్లబ్ భవనం నిర్మాణం పూర్తయితే జర్నలిస్టుల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, వృత్తి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రంగా ఉపయోగపడనుంది. ప్రజలకు, మీడియాకు మధ్య సమాచార మార్పిడిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ భవనం వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జర్నలిస్టుల విజ్ఞప్తికి వెంటనే స్పందించి, ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, మీడియా అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

**ఖిల్లా ఘనపూర్,ఆగస్టు05(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం ఆగారం గ్రామంలో గ్రామ నర్సరీ, వైకుంఠధామం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. నిత్యం నర్సరీలో పనిచేసేందుకు ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతం కావడంతో పాటు, మూగజీవులు సైతం సంచరిస్తున్న ఈ ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది.ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పలుమార్లు కోరుతున్నప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రాంతంలో ప్రమాదకర పరిస్థితులు నెలకొనడంతో ఏదైనా అనుకోని ఘటన జరిగితే బాధ్యత ఎవరిదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.ప్రజలు, మూగజీవుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ఆగారం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# 11వ వార్డులో రేషన్ దుకాణం తనిఖీ.. లబ్ధిదారులతో ముచ్చటించిన ప్రణవ్

- **జమ్మికుంట టౌన్ ఆగస్టు 05 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట పట్టణంలోని 11వ వార్డులో గల ప్రభుత్వ రేషన్ దుకాణాన్ని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం నాణ్యత, పంపిణీ విధానంపై ఆయన నేరుగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.


ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యం కంటే ప్రస్తుతం అందిస్తున్న సన్న బియ్యం నాణ్యత మెరుగ్గా ఉందని, మూడు పూటలా వినియోగించుకునేందుకు అనువుగా ఉందని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

వొడితల ప్రణవ్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన బియ్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, స్థానిక కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షురాలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం.. రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలి

- **గుడిసెల్లో నివసించే అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు**
- **జిల్లా ప్రత్యేక అధికారి వి.పి గౌతమ్**

**వనపర్తి,ఆగస్టు05(తెలంగాణ ముచ్చట్లు):**



ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లించేందుకు వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి వి.పి. గౌతమ్ ఆదేశించారు.బుధవారం వనపర్తి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఎల్‌నినో పరిస్థితులు, పంటల మార్పిడి, ఇందిరమ్మ ఇళ్లు, మిషన్ భగీరథ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే ఇప్పటి వరకు 18 శాతం లోటు నమోదైనట్లు అధికారులు తెలిపారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను నమ్ముకుని రైతులు పూర్తిగా వరి సాగుపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేరుశెనగ సాగును 40 వేల ఎకరాలకు, మినుముల సాగును 30 వేల ఎకరాలకు పెంచడంతో పాటు కందుల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని ఏడాదికి 6 వేల ఎకరాలకు పెంచి, 7 వేల ఎకరాల్లో కూరగాయల సాగు చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గుడిసెల్లో నివసించే అర్హులందరికీ ఇళ్ల మంజూరు, రూఫ్ రీప్లేస్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సీపీఓ హరికృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం: పాడి కౌశిక్ రెడ్డి






**వీణవంక, ఆగస్టు 05 (తెలంగాణ ముచ్చట్లు):**

కరీంనగర్ జిల్లా వీణవంక మండల అభివృద్ధి పనులు, ప్రభుత్వ శాఖల పనితీరుపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బుధవారం సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయం, ఉద్యానవనం, మిషన్ భగీరథ, విద్య, వైద్యం, నీటిపారుదల, ఇందిరమ్మ ఇళ్లు, రహదారులపై అధికారులను ప్రశ్నించారు.

సమావేశంలో అధికారులు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశాలకు హాజరుకావాలని అధికారులకు సూచించారు.

రైతులకు యూరియా కొరత లేకుండా అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, సాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రైతుబంధు, రైతు బీమా వివరాలను అధికారులు సమర్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల విద్యుత్ ఇస్తామని చెప్పి 14 గంటలకే పరిమితం చేయడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు.

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ముఖ్యంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు హామీ ఇచ్చిన తులం బంగారాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

ఇసుక క్వారీల రాకపోకలతో దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతు చేసి గుంతలను పూడ్చాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి నిరంతరాయంగా తాగునీరు అందించాలని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులకు న్యాయం చేయాలని సూచించారు.

పామాయిల్ సాగును ప్రోత్సహించడంతో పాటు రైతులకు ఎరువులు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా సాగునీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టాలని, న్యూట్రిషన్ కిట్ల పంపిణీని పునఃప్రారంభించాలని, యాప్ విధానానికి బదులుగా షాపుల ద్వారా యూరియా పంపిణీ చేయాలని సమావేశంలో తీర్మానించారు.

వీణవంక మండల రైతులకు ఉపయోగపడే కల్వల ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

"ప్రజా సంక్షేమమే లక్ష్యం. అధికారులు సమన్వయంతో, అంకితభావంతో పనిచేయాలి. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రతి అధికారి బాధ్యత. ఇకపై ప్రతి నెల గ్రామాల అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తా. నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదు" అని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఆర్వీ ప్రకాష్, తహసీల్దార్ రమేష్, వివిధ శాఖల అధికారులు, ఏఈలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయుడి ఉదార సహాయం

- **హిమ్మత్నగర్ ఎంపీయూపీఎస్‌కు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసిన నాగవెల్లి వేణు**

**వీణవంక, ఆగస్టు 05 (తెలంగాణ ముచ్చట్లు):**



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులే ముందుండి చేయూతనందిస్తే విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం కల్పించవచ్చనే సందేశాన్ని వీణవంక మండలంలోని హిమ్మత్నగర్ ఎంపీయూపీఎస్ సీనియర్ ఉపాధ్యాయుడు నాగవెల్లి వేణు చాటిచెప్పారు. పాఠశాల మౌలిక వసతుల కల్పన కోసం ఆయన రూ.5,000 ఆర్థిక సాయాన్ని బుధవారం ప్రధానోపాధ్యాయుడు గోనె సత్యంకు అందజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం వేణుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అందించిన ఈ సహాయం పాఠశాల అభివృద్ధికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

గతంలో కూడా గ్రామ సర్పంచ్ జడల శ్రీకాంత్‌తో పాటు పలువురు దాతలు పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందించి సహకరించారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# ఆపదలో అండగా సీఎం రిలీఫ్ ఫండ్

- **హౌసింగ్ బోర్డ్ కాలనీలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ.. అనంతరం లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**

**జమ్మికుంట టౌన్, ఆగస్టు 05 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) మంజూరైన చెక్కులను హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

అంతకుముందు జమ్మికుంట హౌసింగ్ బోర్డ్ కాలనీలో కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత-నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో వొడితల ప్రణవ్ బాబు పాల్గొన్నారు. అనంతరం అదే కాలనీలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమకు ఆర్థిక చేయూత అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత-నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రముఖులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల కొరతతో వెలవెలబోతున్న ప్రభుత్వ బడి

- **ఒకే టీచర్,ఒకే విద్యార్థితో కొనసాగుతున్న ప్రైమరి పాఠశాల**

**చిల్పూర్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):**





జనగామ జిల్లా చిల్పూర్ మండలం వడ్డెరగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కొరతతో వెలవెలబోతోంది. ఒకప్పుడు పలువురు విద్యార్థులతో సందడిగా ఉన్న ఈ పాఠశాలలో ప్రస్తుతం ఒకే ఉపాధ్యాయుడు, ఒకే విద్యార్థి మాత్రమే మిగిలారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు సురేందర్, నాలుగో తరగతి విద్యార్థిని రుత్విక మాత్రమే ఉన్నారు. గ్రామంలో విద్యార్థుల నమోదు పెంచేందుకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితం రాలేదని ఉపాధ్యాయుడు తెలిపారు. గతంలో నలుగురు విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం కేవలం ఒక్క విద్యార్థిని మాత్రమే పాఠశాలలో కొనసాగుతున్నట్లు చెప్పారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గురు చిన్నారులు ఉన్నప్పటికీ, బుధవారం అంగన్‌వాడీ చిన్నారులతో పాటు నాలుగో తరగతి విద్యార్థిని రుత్విక కూడా పాఠశాలకు హాజరు కాలేదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం, తల్లిదండ్రులు ప్రైవేట్ విద్యాసంస్థల వైపు మొగ్గు చూపడం వంటి కారణాలతో ప్రభుత్వ బడులు వెలవెలబోతున్నాయని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



# ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి..

## బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణ: కౌశిక్ రెడ్డి

- **పక్క చూపులు చూసేవారు పార్టీని వీడొచ్చు.. బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి హెచ్చరిక**

**హుజూరాబాద్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, బీఆర్ఎస్ పార్టీ పట్ల సానుభూతి పెరుగుతోందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుల సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి ముందు ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికు నాయకులు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు, బూత్ స్థాయి కమిటీల బలోపేతంపై దృష్టి సారించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని ఆరోపించారు. ఇలాంటి సమయంలో ఇతర పార్టీల నాయకులతో, ముఖ్యంగా ఈటల రాజేందర్తో రహస్యంగా సంబంధాలు కొనసాగించే వారు ఉంటే పార్టీని వీడవచ్చని హెచ్చరించారు. పార్టీ కోసం నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత, సాగునీటి సమస్యలు, పంటల పరిస్థితిపై నాయకులతో చర్చించారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందా, ఏ ప్రాంతాల్లో సాగునీటి సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకుని, రైతుల సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్న ఏజెంట్లకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని, ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు బండి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సంగెం ఐలయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు ఏడవెల్లి కొండల్ రెడ్డి, కౌన్సిలర్లు గందే శ్రీనివాస్, వర్ధినేని రవీందర్ రావు, ప్రతాప్ తిరుమల రెడ్డి, పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తల్లిపాలే శిశువుకు తొలి వరం

- **తల్లిపాల వారోత్సవాల్లో అవగాహన, అన్నప్రసన్న కార్యక్రమం**

**వంగాలపల్లి, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):**

తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వంగాలపల్లి అంగన్వాడీ కేంద్రంలో తల్లులు, చిన్నారులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించడంతో పాటు చంటి బిడ్డలకు అన్నప్రసన్న కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య మేనక మాట్లాడుతూ, పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలే సంపూర్ణమైన, శ్రేష్ఠమైన ఆహారమని అన్నారు. తల్లిపాలను మించిన పోషకాహారం మరొకటి లేదని, తల్లిపాలు తాగే పిల్లలు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు రోగనిరోధక శక్తి కూడా అధికంగా పొందుతారని తెలిపారు.

ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించిన ఆమె, ప్రభుత్వం అందిస్తున్న కోడిగుడ్లు, బాలామృతం వంటి పౌష్టికాహారాన్ని చిన్నారులకు క్రమం తప్పకుండా అందించి వారి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత, శిశు సంరక్షణ, సమతుల్య పౌష్టికాహారం అవసరంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అరూరి రవిచందర్, సూపర్వైజర్ దూలమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, గ్రామ కార్యదర్శి మమత, వార్డు సభ్యులు కాదుగాయ మమత, సోమా కరుణ, అర్కాల ఉమలత, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, తల్లులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధం

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం బ్యూరో, ఆగస్టు 5(తెలంగాణ ముచ్చట్లు )



సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ రోజు 'సురక్ష కా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ' అనే ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని అపూర్వంగా సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లు ప్రజల సొమ్ము, వ్యక్తిగత సమాచారం, గోప్యతపై దాడులు చేయడం ఆందోళనకరంగా మారిందన్నారు. నగదులావాదేవీల స్థానంలో యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్వాలెట్లు, ఆన్లైన్ కొనుగోళ్లు, సామాజిక మాధ్యమాల వినియోగం విస్తరించడంతో సైబర్ నేరాలకు అవకాశాలు పెరిగాయని అన్నారు.

సైబర్ నేరాల నివారణలో ప్రతి పౌరుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఒటీపీ, యూపీఐ పిన్, సీవీవీ సంఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదన్నారు. తెలియని లింక్ లను నొక్కకూడదన్నారు. ప్రతి ఖాతాకు వేర్వేరు బలమైన సంకేత పదాలను ఉపయోగించాలన్నారు. రెండు దశల ధృవీకరణ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సందేశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని,అనుమానాస్పద కాల్ వస్తే వెంటనే కాల్ నిలిపివేసి సంబంధిత సంస్థ అధికారిక నంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, నకిలీ వెబ్సైట్లు, నకిలీ మొబైల్ యాప్లు, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు, ఓటీపీలు, యూపీఐ అభ్యర్ధనలు, క్యూఆర్ కోడ్ల ద్వారా డబ్బు దోచుకునే కొత్త పద్ధతులు విస్తృతంగా పెరిగాయని, నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో మరింత చురుకుగా మారుతుండగా, సాధారణ ప్రజలలో అవగాహన అంతే వేగంగా పెరగకపోవడం సమస్యను మరింత క్లిష్టతరం చేస్తోందన్నారు.

ప్రతి నెల వందల సంఖ్యలో సైబర్ మోసాలపై ఫిర్యాదులు నమోదవుతున్నాయని, లక్షల రూపాయల మేర ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అత్యంత విద్యావంతులు కూడా నేరగాళ్ల మానసిక వ్యూహాలకు మోసపోవడం ఈ నేరాల స్వరూపాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఒక్కసారి బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ లేదా వ్యక్తిగత సమాచారం నేరగాళ్ల చేతికి చేరితే కొన్ని నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు.

ఇటీవలి కాలంలో ప్రమాదకరంగా మారిన నేరాల్లో 'డిజిటల్ అరెస్టు' మోసాలని, కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు అధికారులు పేర్లు చెప్పి వీడియో కాల్ ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ గంటల తరబడి ఫోన్లోనే ఉంచి వారి నుంచి లక్షల రూపాయలు బదిలీ చేయించుకునే సంఘటనలు వెలుగు చూశాయని,అలాగే పెట్టుబడి పెడితే రోజుల్లోనే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మిస్తూ నకిలీ ట్రేడింగ్ యాప్ల ద్వారా లక్షల రూపాయలు కాజేసే సంఘటనలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్లను తెరవడం, అపరిచిత యాప్లను డౌన్లోడ్ చేయడం, ఓటీపీలు చెప్పడం, క్యూఆర్ కోడ్లను విచక్షణారహితంగా స్కాన్ చేయడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలను అధికంగా పంచుకోవడం, ఒకే సంకేత పదాన్ని అన్ని ఖాతాలకు ఉపయోగించడం వంటి అలవాట్లు నేరగాళ్లకు అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు.

ఆన్లైన్ మోసాలు లేదా ఆర్థిక సైబర్ నేరాలు జరిగితే బాధితులు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని,ఇది 24 గంటలూ పనిచేస్తుందన్నారు.

కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరఫ్, ఎస్సైలు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# యువత ఆవేదనను వినండి: సుప్రీం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ప్రధాన కేసులతో కలిపి విచారించాలని నిర్ణయించింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత నిరసనలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. అలాంటి సందర్భాల్లో పోలీసులు, ఇతర భద్రతా బలగాలు అత్యంత సంయమనంతో వ్యవహరించాలని సూచించింది. శాంతిభద్రతలను పరిరక్షించడం ఎంత ముఖ్యమో, నిరసన తెలిపే ప్రజల హక్కులను గౌరవించడం కూడా అంతే ముఖ్యమని ధర్మాసనం అభిప్రాయపడింది. యువత హింసాత్మక మార్గాల వైపు మళ్లకుండా చూడటం అధికారుల ప్రాథమిక బాధ్యత అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. యువకులు ఏమి కోరుకుంటున్నారు, వారి సమస్యలు, ఆవేదనలకు కారణాలేమిటో ఓపికగా విని అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. సంభాషణ, అవగాహన ద్వారా అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధర్మాసనం పేర్కొంది.

అయితే శాంతిభద్రతలను కాపాడే విషయంలో చట్ట అమలు సంస్థల విచక్షణపై తమకు పూర్తి విశ్వాసం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పరిస్థితులకు అనుగుణంగా అధికారులు తీసుకునే చర్యలు చట్టపరమైన పరిధిలో ఉండాలని సూచించింది. ప్రజా ఆస్తుల రక్షణతో పాటు ప్రజాస్వామ్య విలువలను కూడా సమానంగా పరిరక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ వ్యవహారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం సమర్పించే నివేదికలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం వెల్లడించింది. విద్యార్థి ఆందోళనలు, హింసాత్మక ఘటనలు, చట్ట అమలు సంస్థల చర్యలపై సమగ్ర నివేదిక అందిన తర్వాతే తదుపరి విచారణ చేపడతామని స్పష్టం చేసింది. దీంతో ఈ కేసులో సుప్రీంకోర్టు తదుపరి విచారణపై ఆసక్తి నెలకొంది.




# గుజరాత్‌లో చండీపుర వైరస్ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టగా, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రంలో నమోదైన 184 అనుమానిత కేసుల్లో 35 మందికి చండీపుర వైరస్ సోకినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా తెలిపారు. మరో 11 మంది నమూనాల పరీక్షా ఫలితాలు రావాల్సి ఉన్నాయని వెల్లడించారు. గాంధీనగర్, సబర్‌కాంత-హిమ్మత్‌నగర్, పటాన్, రాజ్‌కోట్, భావ్‌నగర్ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేక వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఆరుగురు చిన్నారులు కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయినట్లు వివరించారు.

చండీపుర వైరస్ నిర్ధారణ అయిన వారంతా 15 ఏళ్లలోపు చిన్నారులేనని మంత్రి తెలిపారు. ఈ వైరస్ ఒకే గ్రామం లేదా జిల్లాకు పరిమితం కాలేదని, గుజరాత్‌లోని పలు ప్రాంతాల నుంచి కేసులు నమోదవుతున్నాయని వెల్లడించారు. దీంతో వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖ బృందాలు క్షేత్రస్థాయిలో నిఘా పెంచాయని, దోమలు, ఇసుక ఈగల నివారణ కోసం విస్తృతంగా పురుగుమందులు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మి భయాందోళనలకు గురికావద్దని ఆరోగ్య శాఖ సూచించింది. పిల్లల్లో అధిక జ్వరం, వాంతులు, మూర్ఛ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ప్రారంభ దశలోనే వైద్య చికిత్స అందితే ప్రాణాపాయం తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.

చండీపుర ఎన్సెఫలైటిస్ ఒక అరుదైన వైరల్ వ్యాధి. ఇది ప్రధానంగా ఇసుక ఈగల ద్వారా వ్యాపించి మెదడులో వాపుకు కారణమవుతుంది. ఈ వైరస్‌ను 1965లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా చండీపుర గ్రామంలో తొలిసారిగా గుర్తించారు. ముఖ్యంగా 15 ఏళ్లలోపు పిల్లలపై ఈ వైరస్ తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. సకాలంలో చికిత్స అందకపోతే పరిస్థితి వేగంగా విషమించే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం చండీపుర వైరస్‌కు ప్రత్యేక టీకా లేదా నిర్దిష్ట యాంటీవైరల్ ఔషధం అందుబాటులో లేదు. అందువల్ల లక్షణాలను బట్టి సహాయక చికిత్సే ప్రధాన మార్గంగా వైద్యులు పేర్కొంటున్నారు. వైరస్ వ్యాప్తిని నియంత్రించేందుకు పరిసరాల పరిశుభ్రత, ఇసుక ఈగల నియంత్రణ, పిల్లలను కీటకాల కాట్ల నుంచి రక్షించడం, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య శాఖ ప్రజలకు సూచించింది.



# పంట కుంటల ఏర్పాటుతో జల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

- నిర్దేశిత లక్ష్యాన్ని తప్పకుండా సాధించాలి
- జిల్లా స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి

హనుమకొండ, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమంలో భాగంగా పంట కుంటల ఏర్పాటులో నిర్దేశించిన లక్ష్యాలను తప్పకుండా పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, ఎంపీఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జలసిరి గ్రామ అభివృద్ధి ప్రణాళిక అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. పంట కుంటల ఏర్పాటు ద్వారా వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెరుగుదల, సాగునీటి లభ్యత మెరుగుపడటంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు.

రైతులకు పంట కుంటల ఉపయోగాలపై విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే పంట కుంటలు ఏర్పాటు చేసి ప్రయోజనాలు పొందుతున్న ప్రాంతాలకు రైతులను తీసుకెళ్లి ప్రత్యక్షంగా వివరించడం ద్వారా మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు.గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, గ్రామ సభల ద్వారా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను త్వరితగతిన సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ ప్రణాళికతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే గ్రామీణాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జల సంరక్షణ చర్యలు అత్యంత అవసరమన్నారు. పంట కుంటలు, ఊర కుంటలు, ఇంకుడు గుంతలు వంటి నీటి సంరక్షణ నిర్మాణాలను విస్తృతంగా ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని భవిష్యత్ అవసరాలకు వినియోగించుకోవచ్చని వివరించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఎల్. రమాకాంత్, ఎంపీడీవోలు, ఎంపీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ విదేశీ పర్యటనకు కోర్టు అనుమతి

- ఏసీబీ ప్రత్యేక కోర్టు గ్రీన్‌సిగ్నల్
- పలు షరతులతో పాస్‌పోర్ట్ విడుదలకు ఆదేశాలు
- ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు విదేశీ పర్యటన
- ఓటుకు నోటు కేసు విచారణ సుప్రీంకోర్టులో కొనసాగుతోంది

హైదరాబాద్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు అనుమతి మంజూరు చేసింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి అధికారిక విదేశీ పర్యటన నిమిత్తం తన పాస్‌పోర్ట్‌ను తాత్కాలికంగా తిరిగి ఇవ్వాలని, విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలని కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం పలు షరతులు విధిస్తూ విదేశీ పర్యటనకు అనుమతి ఇచ్చింది. కోర్టు ఆదేశాల ప్రకారం రేవంత్ రెడ్డి ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో అధికారికంగా పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన సమర్పించిన పిటిషన్‌ను పరిశీలించిన ఏసీబీ ప్రత్యేక కోర్టు రూ.1 లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఒకరి హామీ సమర్పించాలని ఆదేశించింది. అలాగే పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రణాళిక, ఆయా దేశాల్లో బస చేసే చిరునామాలు, ప్రయాణ వివరాలను కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది.

విదేశీ పర్యటనకు ముందు కేంద్ర విదేశాంగ శాఖ నుంచి అవసరమైన రాజకీయపరమైన అనుమతులు పొందాలని కూడా కోర్టు షరతు విధించింది. పర్యటన ముగించుకుని భారత్‌కు తిరిగి వచ్చిన అనంతరం 2026 సెప్టెంబర్ 18లోగా తన పాస్‌పోర్ట్‌ను మళ్లీ కోర్టులో జమ చేయాలని న్యాయస్థానం ఆదేశాల్లో పేర్కొంది. ఈ షరతులను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. 2015లో నమోదైన ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి మొదటి నిందితుడిగా ఉన్నారు. అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయాలని నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షల లంచం ఇవ్వడానికి ప్రయత్నించారనే ఆరోపణలపై 2015 మే 31న ఏసీబీ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

ఈ కేసులో దాదాపు నెల రోజుల పాటు జైలులో ఉన్న రేవంత్ రెడ్డికి అనంతరం హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ షరతుల్లో భాగంగా ఆయన తన పాస్‌పోర్ట్‌ను కోర్టులో జమ చేయాలని, విదేశాలకు వెళ్లాల్సి వస్తే ముందుగా ఏసీబీ ప్రత్యేక కోర్టు అనుమతి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. అప్పటి నుంచి విదేశీ పర్యటనల కోసం ప్రతిసారి కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఈ కేసులో రేవంత్ రెడ్డి సహా ఇతర నిందితులపై అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనలు, భారతీయ శిక్షాస్మృతిలోని నేరపూరిత కుట్రకు సంబంధించిన సెక్షన్ 120బీ కింద ఏసీబీ అధికారులు అభియోగపత్రం దాఖలు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో విదేశీ పర్యటనకు కోర్టు షరతులతో అనుమతి ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సాంకేతిక పాలనకు బ్రిక్స్ దేశాల మద్దతు

- భారత్ అధ్యక్షతన రెండు రోజుల కీలక సమావేశాలు ముగింపు
- అవినీతి నిరోధంలో కార్యాచరణకు సభ్య దేశాల అంగీకారం
- పరారీలో ఉన్న నిందితుల గుర్తింపు, ఆస్తుల రికవరీపై కీలక నిర్ణయాలు
- సాంకేతిక ఆధారిత పారదర్శక పాలనకు బ్రిక్స్ దేశాల మద్దతు




హైదరాబాద్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):

భారత్ బ్రిక్స్ అధ్యక్షత2026లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశం, బ్రిక్స్ ఆస్తుల పునరుద్ధరణ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. ఆగస్టు 4, 5 తేదీల్లో కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశాల్లో బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన సీనియర్ విధాన నిర్ణేతలు, అవినీతి నిరోధక సంస్థలు, ఆర్థిక నిఘా విభాగాలు, దర్యాప్తు సంస్థల ప్రతినిధులు పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. భారత్ బ్రిక్స్ అధ్యక్షత నినాదమైన "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" కు అనుగుణంగా జరిగిన ఈ సమావేశాలను కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ కార్యదర్శి రచనా షా ప్రారంభించారు. అవినీతిపై భారత్ అనుసరిస్తున్న 'జీరో టాలరెన్స్' విధానాన్ని ఆమె వివరించారు. సుస్థిర అభివృద్ధి, సుపరిపాలన, ప్రజల విశ్వాసానికి నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం, సాంకేతిక ఆధారిత పరిపాలన, బలమైన సంస్థలు కీలకమని పేర్కొన్నారు.

బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ కేవలం అభిప్రాయాల మార్పిడికే పరిమితం కాకుండా కార్యాచరణ వేదికగా రూపాంతరం చెందుతోందని సమావేశంలో అభిప్రాయపడినట్లు అధికారులు తెలిపారు. అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను గుర్తించడం, అప్పగింత ప్రక్రియను వేగవంతం చేయడం, సంబంధిత దేశాల మధ్య సమాచార మార్పిడిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక న్యాయ అమలు సంస్థల నెట్‌వర్క్ ఏర్పాటు ప్రతిపాదనపై సభ్య దేశాలు సూత్రప్రాయ అంగీకారం తెలిపాయి. అలాగే పరారీలో ఉన్న అవినీతి నిందితులను గుర్తించేందుకు అనధికారిక సహకార మార్గాల సమాచారాన్ని సమగ్రంగా అందించే ప్రత్యేక సమాచార భాండాగారాన్ని కూడా సభ్య దేశాలు స్వాగతించాయి. ఆస్తుల పునరుద్ధరణ నిపుణుల సమావేశంలో అవినీతి ద్వారా అక్రమంగా సంపాదించిన ఆస్తులను గుర్తించడం, స్వాధీనం చేసుకోవడం, సంబంధిత అధికారుల మధ్య వేగవంతమైన సమాచార మార్పిడికి ప్రామాణిక నమూనాలపై ఏకాభిప్రాయం కుదిరింది. సభ్య దేశాల నిపుణుల వివరాలతో ప్రత్యేక డైరెక్టరీ రూపొందించేందుకు అంగీకారం వ్యక్తమైంది. అంతర్జాతీయ ఆస్తుల రికవరీ, దర్యాప్తు విధానాలపై సభ్య దేశాలు తమ అనుభవాలను పంచుకొని పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించాయి.

"ఆవిష్కరణలు, సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన" అంశంపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో డిజిటల్ పాలన, ఈ సేకరణ వ్యవస్థలు, కృత్రిమ మేధ, యంత్ర అభ్యాసం, భారీ సమాచార విశ్లేషణ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అవినీతి నిరోధానికి ఎలా వినియోగించాలనే దానిపై చర్చించారు. బహిరంగ సమాచారం, డిజిటల్ సామాజిక తనిఖీలు, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు, ప్రజల భాగస్వామ్యం ద్వారా సంస్థల జవాబుదారీతనాన్ని పెంచి ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయవచ్చని అభిప్రాయపడ్డారు. ఆర్థిక సాంకేతిక సేవలు, వర్చువల్ డిజిటల్ ఆస్తుల దుర్వినియోగం ద్వారా అవినీతి సొమ్ము బదిలీ చేసే ప్రమాదాలను ఎదుర్కోవడంపై కూడా సభ్య దేశాలు విస్తృతంగా చర్చించాయి. మనీలాండరింగ్, ఉగ్రవాద నిధుల సమీకరణ నిరోధక చర్యలను బలోపేతం చేస్తూనే ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇచ్చే సమతుల్య నియంత్రణ వ్యవస్థలు అవసరమని పేర్కొన్నాయి. భారత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలు అంతర్జాతీయ అవినీతి నిరోధక సహకారం, పరారీలో ఉన్న నిందితుల గుర్తింపు, ఆస్తుల రికవరీ, పారదర్శక పరిపాలన, సాంకేతిక ఆధారిత పాలనకు భవిష్యత్ బ్రిక్స్ అధ్యక్ష దేశాలకు బలమైన పునాదిని వేశాయని అధికారులు వెల్లడించారు.



# లెదర్ పార్క్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని కేంద్రానికి వినతి

- లోక్‌సభలో రూల్-377 కింద కడియం కావ్య ప్రస్తావన
- స్టేషన్ ఘన్‌పూర్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని విజ్ఞప్తి
- ఉపాధి అవకాశాల దృష్ట్యా కేంద్రానికి వినతి
- ఎస్సీ యువతకు భారీగా ఉపాధి లభిస్తుందని వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రతిపాదించిన మెగా లెదర్ పార్కుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదం తెలపాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. బుధవారం లోక్‌సభలో రూల్ 377 కింద ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రతిపాదన చాలా కాలంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండటంతో ఉపాధి కల్పనకు దోహదపడే కీలక ప్రాజెక్టు ఆలస్యమవుతోందని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రభుత్వం గుర్తించిన 120 ఎకరాల భూమిలో తెలంగాణ స్టేట్ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్లు ఎంపీ వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

తెలంగాణలో లెదర్ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన ముడి పదార్థాల లభ్యతతో పాటు పాదరక్షల రూపకల్పన, ఫ్యాషన్, నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన జాతీయ స్థాయి సంస్థల సహకారం కూడా అందుబాటులో ఉందని కడియం కావ్య తెలిపారు. దీంతో ఈ ప్రాజెక్టు పరిశ్రమల అభివృద్ధికి బలమైన వేదికగా నిలుస్తుందని అన్నారు. ఈ మెగా లెదర్ పార్క్ ఏర్పాటుతో ముఖ్యంగా ఎస్సీ వర్గాలకు చెందిన యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ పేర్కొన్నారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఈ ప్రాజెక్టు ఊతమిస్తుందని వివరించారు.

రాష్ట్రప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ కేంద్రం నుంచి ఆమోదం రాకపోవడంతో ప్రాజెక్టు అమలు ముందుకు సాగడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కల్పనకు దోహదపడే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును మరింత ఆలస్యం చేయకుండా కేంద్రం వెంటనే ఆమోదించాలని కోరారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, జౌళి శాఖ ఈ ప్రతిపాదనను అత్యవసరంగా పరిశీలించి మెగా లెదర్ పార్కుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు అమలైతే వరంగల్ పార్లమెంట్ పరిధితో పాటు తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

# బస్తీబాటకు విశేష స్పందన

- ప్రజల గడపకే విద్యుత్ సేవలు
- ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం
- రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించిన కార్యక్రమం
- విద్యుత్ వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):



ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన విద్యుత్ సేవలను నేరుగా అందించాలనే లక్ష్యంతో తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ నిర్వహిస్తున్న "బస్తీబాట" కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ప్రజల వద్దకే విద్యుత్ సేవలను తీసుకెళ్లి, సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా అధికారులు విస్తృతంగా చర్యలు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షలకు అనుగుణంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మార్గదర్శకత్వంలో, టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

ఆగస్టు 4న నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో సర్కిల్, డివిజన్, సబ్‌డివిజన్ స్థాయి అధికారులు, ఇంజనీర్లు, ఆర్టిసన్లు, ఫీల్డ్ సిబ్బంది ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, మరమ్మతులు, యార్డుల శుభ్రపరిచే పనులు, పొదలు, చెట్ల కొమ్మల తొలగింపు, ఏబీ స్విచ్‌లు, హెచ్‌జీ ఫ్యూజ్‌లు, బ్రాస్ జంపర్లు, కేబుళ్ల మార్పిడి, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మార్పిడి వంటి పనులు చేపట్టారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలకు ప్రాధాన్యం ఇచ్చారు.

వ్యవసాయ విద్యుత్ వినియోగదారులతో అధికారులు ప్రత్యక్షంగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే గణేష్ విగ్రహాల తయారీ కేంద్రాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా అవసరమైన సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రజలతో కలిసి, ప్రజల కోసమే "బస్తీ బాట" కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. నాణ్యమైన, సురక్షితమైన, నిరంతర విద్యుత్ సరఫరాను అందించడంతో పాటు ప్రజల సమస్యలకు వేగంగా స్పందించే విద్యుత్ సేవలను మరింత విస్తరించేందుకు సంస్థ కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్–2026 సదస్సు

- ప్రపంచ పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం
- శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి

హైదరాబాద్, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):



డిసెంబర్‌లో నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్-2026" గ్లోబల్ సమ్మిట్‌కు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత కీలకమని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల ఆర్థికోత్పత్తి వృద్ధికి ఈ గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలవనున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్" కార్యక్రమాన్ని అమలు చేస్తోందని సమావేశంలో వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రాంగణాన్ని గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు వినియోగించే అవకాశాన్ని పరిశీలించాలని అధికారులు సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

సమావేశంలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంచడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్, ఇన్వెస్ట్ తెలంగాణ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సమాచార సాంకేతిక శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పదోన్నతులపై కవిత ఆందోళన

- 600 మంది ఉద్యోగులకు అన్యాయం జరిగిందని ఆరోపణ
- కొత్తగూడెంలో 72 గంటల నిరాహార దీక్షకు మద్దతు
- బదిలీల పేరుతో వేధింపులు చేస్తున్నారని విమర్శ
- పదోన్నతులు వెంటనే కల్పించాలని డిమాండ్

కొత్తగూడెం, ఆగస్టు 5 (తెలంగాణ ముచ్చట్లు):

సింగరేణిలో 2016, 2017 సంవత్సరాల్లో జేఎంఈటీ ద్వారా ఉద్యోగాల్లో చేరిన 800 మంది ఉద్యోగుల్లో 2023 నాటికి ఓవర్‌మెన్ పదోన్నతులు ఇవ్వాల్సి ఉండగా కేవలం 200 మందికే పదోన్నతులు కల్పించి, మిగిలిన 600 మందిని పక్కనపెట్టడం అన్యాయమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. పదోన్నతుల అంశంపై యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్న ఉద్యోగులను బదిలీల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని ఆమె విమర్శించారు. ఉద్యోగుల న్యాయమైన హక్కులను పరిరక్షించే బాధ్యత యాజమాన్యంపై ఉందని పేర్కొన్నారు.

పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెంలో ఉద్యోగులు చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షకు తెలంగాణ రక్షణ సేన, హెచ్ఎంఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు కవిత వెల్లడించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం వెంటనే స్పందించాలని కోరారు. సింగరేణి యాజమాన్యం మొండి వైఖరిని వీడి అర్హులైన 600 మంది ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. పదోన్నతుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించడం ద్వారా సంస్థలో సానుకూల వాతావరణం నెలకొంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల హక్కులను పరిరక్షించడంలో యాజమాన్యం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అయితే ఈ ఆరోపణలు, డిమాండ్లపై సింగరేణి యాజమాన్యం నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. పదోన్నతుల అంశంపై యాజమాన్యం తీసుకునే నిర్ణయంపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in